క్లుప్తంగా

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)కి ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ కిడ్నీ వైద్య నిపుణులు డాక్టర్ దినేష్ కుమార్‌రెడ్డి ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. కిడ్నీలో రాళ్లు, కిడ్నీ వాపు, కిడ్నీ గడ్డలు, కిడ్నీ, యూరిన్ ఇన్ఫెక్షన్, మూత్ర, ప్రోస్టేట్ గ్రంధి, అంగ సమస్యలు, చిన్నపిల్లల అంగం, చిన్న పిల్లల గజ్జల్లో వాపు, బీజం, సెక్స్, పిల్లలు పుట్టకపోవడం తదితర సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బులు, సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వైద్య చికిత్సలు అందిస్తారు. అలాగే ఉచిత షుగర్ పరీక్షలు చేస్తారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్టు డాక్టర్ హర్షవర్ధన్‌రెడ్డి సలహాలు, సూచనలు ఇస్తారు. పరీక్ష చేయించుకోవాలనుకునే వారు పరగడుపున రావాలి. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. మరిన్ని వివరాలకు 9703622831, 08568286189 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని పేర్కొన్నారు.

వేరుశనగకాయల రిజిస్ట్రేషన్ చేసుకోండి



వేరుశనగ రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : పులివెందుల మండలానికి సంబంధించి వేరుశనగకాయల రిజిస్ట్రేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారిణి నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేరుశనగ కాయలు కావాల్సిన వారు ఆధార్ కార్డు, పాసుపుస్తకం తీసుకెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అర్హులైన రైతులకు సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు కావాల్సిన ఎరువులు, మందులు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. పత్తి పంటలో దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే అధికారులు చెప్పే సలహాలు, సూచనలు పాటించి మందులు వాడాలని సూచించారు. అలాగే పీఎం కిసాన్‌కు సంబంధించి ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ మరమ్మతుల కారణంగా మినీసెక్రటేరియట్ రోడ్డు, కడప రోడ్డు నుంచి గురుకుల పాఠశాల, మెడికల్ కళాశాల ప్రాంతాల్లో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

వేంపల్లె : స్థానిక రాజారెడ్డి నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని శ్రీరామ నగర్ ఫీడర్‌లో మరమ్మతు పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జేఈ శివదినేష్ కుమార్ వెల్లడించారు. శనివారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాజీవ్ నగర్ కాలనీ, ఎన్టీఆర్ సర్కిల్, ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపం, ఫైర్ స్టేషన్, గురుకుల పాఠశాల తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఖాజామొహిద్దిన్

వేముల : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పులివెందుల డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాజామొహిద్దిన్ పేర్కొన్నారు. మండలంలోని బెస్తవారిపల్లె గ్రామంలో శుక్రవారం వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, బోధకాలు, మెదడువాపు వంటి వ్యాధులు వస్తాయన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి దోమలను నివారించుకోవాలన్నారు. పరిసరాల్లో నిల్వ ఉన్న నీటి ద్వారా దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ఇళ్లలోని డ్రమ్ములు, బానలలో ఉన్న నీటిని పారబోసి ఆరబెట్టిన తర్వాతనే తిరిగి నీటితో నింపుకోవాలన్నారు. వాటిని శుభ్రం చేసుకోవడం ద్వారా దోమలు వ్యాప్తి చెందవన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, ఆరోగ్య కార్యకర్తలు భాస్కర, నాగేశ్వరి, సీహెచ్ఓ వీణాకుమారి, ఆశాకార్యకర్త లక్ష్మి పాల్గొన్నారు.

వేసవి దుక్కులు.. లాభాలు దక్కు

- చీడపీడలు, కలుపు నివారణకు దోహదం
- లోతుగా దున్నితే అధిక దిగుబడులు

పులివెందుల రూరల్ : ఖరీఫ్ పంటలు వేయడానికి ముందు పొలాల్లో వేసవి దుక్కులు దున్నడం వల్ల రైతులకు ఎంతో లాభదాయకం. దుక్కులు లోతుగా దున్నడం వల్ల అధిక ప్రయోజనం పొందవచ్చు. భూమి వదులు అవుతుంది. దీంతో పంటల దిగుబడి పెరిగి సకాలంలో చేతికి వస్తాయి.

వేరు విస్తరించే అవకాశం

వేసవిలో లోతుగా దుక్కులు దున్ని తొలకరి జల్లులు కురిసిన తర్వాత గొర్రు తిప్పి సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరించడానికి అనుకూలంగా ఉంటుంది. నేల అధికంగా నీటిని పీల్చుకుంటుంది. సేద్యానికి ఉపయోగించే గొర్రు, గుంటక, దంతెల వంటి పరికరాలు నేల లోపలికి 3 నుంచి 6 అంగుళాల వరకు చొచ్చుకునిపోతాయి. ఈ పరికరాలు తరచూ ఉపయోగించడం వల్ల నేల లోపల సుమారు 3 నుంచి 5 అంగుళాల లోతులో ఒక గట్టి పొర ఏర్పడుతుంది. దీంతో నేలకు నీటిని పీల్చుకునే శక్తి తగ్గుతుంది. కావున వేసవి దుక్కుల సమయంలో నేలను లోతుగా దున్నినప్పుడు ఈ గట్టి పొర ఛేదించబడి నేలకు నీటిని పీల్చుకునే శక్తి అధికమవుతుంది.

మొండిజాతి కలుపు నివారణ

పొలాల్లో వేసవి దుక్కులు దున్నినప్పుడు కలుపు మొక్కలు, కాయలు, వేర్లు, దుంపలు పెకిలించబడి వేసవిలో ఉండే ఉష్ణోగ్రతలకు అవి నశించడానికి ఆస్కారం ఉంటుంది. దుక్కి దున్నిన తర్వాత నేల పైకి తేలిన కాయలు, దుంపలు ఏరివేసుకుంటే పొలం శుభ్రంగా తయారవుతుంది. తుంగ, గరిక, గుంజర వంటి మొండిజాతి కలుపు మొక్కలు పొలంలో అధికంగా పెరిగి పంటలను నాశనం చేస్తుంటాయి. కాని వేసవి దుక్కులు లోతుగా తీయడంతో పొలంలోని చీడలు నాశనమయ్యే అవకాశమున్నందున రైతులు అధికారుల సూచనల మేరకు జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.



భూమి దున్నుతున్న రైతు

దుక్కులు లోతుగా దున్నుకోవాలి

దుక్కులను లోతుగా దున్నడం వల్ల నేల వదులై మెత్తగా తయారవుతుంది. తొలకరి వర్షాలు పడిన వెంటనే నీరు పల్లంవైపు పార్లకుండా ఎక్కడికక్కడే పొలంలోనే ఇంకిపోతుంది. భూమికి ఎక్కువ రోజులు తేమ నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీనివల్ల పైరు వేసిన తర్వాత వర్షాలు పడటం కొద్దిగా ఆలస్యమైనా పంటకు నష్టం జరుగదు.

పెరగనున్న సేంద్రియ పదార్థాలు

పంటల కోతల తర్వాత నేలపై మిగిలే పంట మొదళ్లు, పొలంలో మిగిలిన కలుపు మొక్కలు, పంటల నుంచి రాలిపడిన ఆకుల వంటి వివిధ సేంద్రియ పదార్థాలన్నీ లోతు దుక్కి దున్నినప్పుడు నేలలో కలిసి కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. దీంతో నేలలో సేంద్రియ పదార్థాలు, పోషక విలువలు పెరగడానికి అవకాశం ఉంటుంది. లోతు దుక్కులు దున్ని సిద్ధం చేసుకుంటే వాన కాలానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

మందలు పెట్టుకుంటే పొలానికి ఎంతో బలం

వేసవిలో పొలాల్లో ఎలాంటి పంటలు ఉండవు. కాబట్టి రైతులు వేసవిలో తమ పొలాల్లో పశువులు, గొర్రెల మందలు పెట్టుకుంటే మంచిది. పశువులు, గొర్రెలను పొలంలో మందలు కట్టడం రైతులకు పాత విషయమే, కాబట్టి ఆ పని వేసవిలో చేస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పొలంలో మందలను కట్టిన సమయంలో మల, మూత్రాలు విసర్జిస్తాయి. దీంతో చేనుకు అవసరమైనంత ఎరువు లభించి అదనపు బలం చేకూరుతుంది.

భూసారం పెరుగుతుంది



రైతులు వర్షాభావం కింద దుక్కులు దున్నుకునేటప్పుడు ఒక్క మడకతో దున్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. ఆరు నుంచి ఏడు అంగులాల పైన నేల దున్నినట్లయితే భూమి మరింత సారవంతమవుతుంది. రైతులు చెరువుల్లోని మట్టిని పంట పొలాలకు వేసుకుంటే భూసారం పెరుగుతుంది.

– నాగలక్ష్మి, వ్యవసాయ అధికారిణి

గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



చెన్నూరు : వివిధ పార్టీల నాయకులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ సుధాకర్



సింహాద్రిపురం : కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ వినోద్‌కుమార్



వేంపల్లె : మాట్లాడుతున్న సీఐ చాంద్‌బాషా

చెన్నూరు : ఎన్నికల కోడ్ జూన్ ఆరవ తేదీ వరకు అమలులో ఉంటుందని, ఎవరైనా గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కమలాపురం నోడల్ అధికారి, డీఎస్పీ ఎం.సుధాకర్ హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్, ట్రబుల్ మాంగర్స్, రాజకీయ నాయకులకు ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా అందరికీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున ఇరువర్గాల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి రెచ్చగొట్టే ప్రయత్నాలు ప్రసంగాలు చేయకుండా, అలాగే టపాసులు ఊరేగింపులు నిర్వహించకుండా ఉండాలని సూచించారు. అంతేకాకుండా ఎన్నికల కోడ్ ఉన్నందున 144 సెక్షన్‌తోపాటు 30 యాక్ట్ అమలులో ఉంటుందని ఎవరూ కూడా రోడ్లపై గుంపులుగా ఉండరాదని, ఎవరి ఇళ్లలో వారు ఉండాలని తెలిపారు. కౌంటింగ్ తర్వాత ఎవరైనా రెచ్చగొట్టే విధంగా చేసినా, గొడవలకు, ఘర్షణలకు పాల్పడినా అలాంటి వారిని ఉపేక్షించేది లేదని కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ పార్థసారథి, చెన్నూరులోని వివిధ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ..

సింహాద్రిపురం : శాంతి భద్రతలకు విఘాతం కల్గించినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం సింహాద్రిపురం పోలీస్ స్టేషన్‌లో మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీన ఎన్నికల కౌంటింగ్ రోజున ఎలాంటి అల్లర్లకు పాల్పడినా, కవ్వింపు చర్యలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని, ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో వివాదాలకు తావివ్వకుండా మెలగాలని, ప్రజలు ఎక్కడా గుంపులుగా ఉండకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో పులివెందుల రూరల్ సీఐ బాలమద్దిలేటి, అర్బన్ సీఐ శంకర్‌రెడ్డి, ఎస్సై అనిల్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే..

వేంపల్లె : ఎవరైనా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వేంపల్లె సీఐ చాంద్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఎస్సై ప్రవీణ్‌కుమార్, సిబ్బందితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కాలనీలో ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలపై ఆరా తీశారు. అలాగే వాహనాలు తనిఖీ చేశారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. జూన్ 4 వరకు కాలనీలో అల్లర్లు సృష్టిస్తే గ్రామ బహిష్కరణ తప్పదని హెచ్చరించారు. ప్రజల భద్రత పోలీసుల లక్ష్యమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

శేష వాహనంపై విహరించిన సుబ్రమణ్యేశ్వరస్వామి



సుబ్రమణ్యస్వామి రథాన్ని లాగుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పూజలందుకుంటున్న సుబ్రహ్మణ్యస్వామి

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణుడు గజ వాహనంపై, అలాగే శ్రీవల్లి దేవసేన సమేత ద్వికందర సుబ్రమణ్యేశ్వరస్వామి శేష వాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఆలయ ప్రధాన సేవకుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు సాయినాథశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న మోక్షనారాయణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు శుక్రవారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా ఆలయ నిర్వాహకుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం మండప అర్చనలు, నారాయణ విష్ణు సూక్త పారాయణం, అభిషేకాలు, సుదర్శన హోమం, సాయంత్రం నవగ్రహ హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్షనారాయణుడు గజ వాహనంపై, శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు శేష వాహనంపై మాడ వీధుల్లో అత్యంత వైభవోపేతంగా ఊరేగి భక్తులకు కనువిందు చేశారు. కాగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన వితరణ చేశారు.

ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక పూజలు

రామాపురం మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన రాకను పురస్కరించుకుని ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథ శర్మ ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట, స్వాముల చరిత్ర గురించి ఎమ్మెల్యే నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులను నిర్వాహకులు శాలువలతో సన్మానించారు. అనంతరం మాడ వీధుల్లో స్వామి వార్ల ఉరేగింపు రథాలను ఎమ్మెల్యే లాగారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, మణికంఠ శర్మ, శ్రీనివాసులరెడ్డి, ఆర్‌వీఎన్‌ఆర్, జనార్ధన్‌రెడ్డి, కొండారెడ్డి, రాజారెడ్డి, క్రిష్ణారెడ్డి, చిన్నరాజారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, తిరుమల్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఉండండి



మాట్లాడుతున్న ఏడీఏ నరసింహారెడ్డి

కమలాపురం : గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి సాగుకు సహకరించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన ఏఈఓ, వీఏఏల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావచ్చిందని, ఈ ఏడాది జూన్‌లోనే వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపిందన్నారు. అందుకే ఇప్పటికే పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేశామన్నారు. అలాగే మరి కొన్ని ప్రాంతాల్లో వేరుశనగ విత్తనాలు కూడా పంపిణీకి సిద్ధం చేశామన్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల విత్తనాలు శనగ, మినుము, పత్తి తదితర వాటితోపాటు ఎరువులు సంబంధిత ఆర్‌బీకేల్లో సిద్ధం చేశామన్నారు. కావలసిన రైతులు ఆర్‌బీకే సిబ్బందిని కలసి విత్తనాలు, ఎరువులు తీసుకెళ్లాలన్నారు. అలాగే రైతులు సాగు చేసే విత్తనాలు, ఎరువులను కమలాపురంలోని ల్యాబ్‌లో ఉచితంగా పరీక్షించుకోవచ్చన్నారు. వ్యవసాయ సిబ్బంది సైతం తమ ఉత్పత్తులను పరీక్షించుకునేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. అప్పుడే ల్యాబ్‌లకు విలువ పెరుగుతుందన్నారు. ముఖ్యంగా వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించి సాగుకు సిద్ధం చేయాలన్నారు. రైతులు ఒక్క సీజన్ కోల్పోయినా చాలా నష్టపోతారన్నారు. మీరు రైతులకు సాగు కాలం పట్ల అవగాహన కల్పిస్తే మేలు చేసిన వారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ఏఓలు శ్రీకాంత్‌రెడ్డి, శ్యాంబాబు, సాయిజ్యోతి, సంతోషిణి, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలు



నియామక పత్రాలు అందుకున్న వారితో ప్రిన్సిపల్, ఎంపీడీఓ, కమిషనర్

కమలాపురం : పాలిటెక్నిక్ విద్యతో ఉపాధి అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని కమలాపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానిక ఆ కళాశాలలో జాబ్ అచీవర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కళాశాలలో ఫైనలియర్ చదువుతున్న 12 మందికి కొప్పర్తిలోని డిక్సన్ పరిశ్రమలో ఉపాధి లభించింది. వారికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీడీఓ జ్యోతి, నగర కమిషనర్ రాముడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ కోర్సు చేయడంతో చిన్న వయసులోనే ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అలాగే బి.టెక్‌లో డైరెక్ట్‌గా సెకండియర్ చదవవచ్చన్నారు. తమ కళాశాలలో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ కోర్సులు ఉన్నాయన్నారు. పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు తమ కళాశాలలో ఏ కోర్సులోనైనా నేరుగా చేరవచ్చన్నారు. ఎంపీడీఓ, కమిషనర్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ కోర్సులకు మంచి ఆదరణ ఉందన్నారు. ముఖ్యంగా చిన్న వయసులోనే ఉపాధి అవకాశాలు పొందడంతోపాటు ఉన్నత విద్య కూడా అభ్యసించవచ్చన్నారు. పాలిటెక్నిక్ విద్య చదువుతుండగానే ఈ కళాశాలకు చెందిన 12 మందికి ఉపాధి లభించడం హర్షణీయం అన్నారు. అలాగే మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించే అవకాశం ఉందని, అందులో విద్యార్థులందరికీ ఉపాధి అవకాశం వస్తుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కేవైసీ చేయించుకోవాలి

వల్లూరు : వల్లూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో రుణాలు పొందిన వారితోపాటు, సభ్యత్వం కలిగిన ప్రతి సభ్యుడు కేవైసీ చేయించుకోవాలని పీఏసీఎస్ సీఈవో రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని సహకార సంఘాలన్నీ కంప్యూటరీకరణ జరుగుతున్న నేపథ్యంలో ప్రతి సభ్యుడు కేవైసీ చేయించుకోవాలని ఆయన పేర్కొన్నారు. త్వరలో సహకార సంఘాల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేవైసీ చేయించుకోకపోతే సభ్యత్వం కోల్పోతారని తెలిపారు. వాటితోపాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు అందకుండా పోయే అవకాశం వుందని తెలిపారు. కావున ప్రతి సభ్యుడు తమ ఆధార్ కార్డు జిరాక్స్, ఫోన్ నంబరును వల్లూరులోని పీఏసీఎస్ కార్యాలయంలో అందచేసి కైవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతలకు పరామర్శ

కమలాపురం : కమలాపురం సబ్‌జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలను ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత రెడ్యం వెంకట సుబ్బారెడ్డి పరామర్శించారు. సార్వత్రిక ఎన్నికల రోజున జరిగిన ఘర్షణల్లో ఖాజీపేట, చాపాడు మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు కమలాపురంలో సబ్‌జైలులో ఉన్నారు. శుక్రవారం రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నేత రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి వారిని పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఊపందుకున్న ‘ఉపాధి’



కదిరివారిపల్లెలో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

- రోజుకు 2000 మందికి పని
- కూలి రూ.300కు పెంపు

ఎర్రగుంట్ల : మండల పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ఊపందుకున్నాయి. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకూ వ్యవసాయ పనులకు విరామం ఉండటంతో ప్రస్తుతం ఉపాధి పనులు గ్రామీణ కూలీలకు కల్పతరువుగా మారాయి. సకాలంలో వేతనాలు అందుతుండటంతో పనుల్లో పాల్గొనే వారి సంఖ్య రెట్టింపు అయింది. దీంతో ఉపాధి పనుల కల్పనలో ఎర్రగుంట్ల మండలం ప్రథమ స్థానంలో ఉంది. మండల పరిధిలోని ఇల్లూరు, చిన్నదండ్లూరు, పోట్లదుర్తి, నిడుజివి, కదిరివారిపల్లె, వలసపల్లె తదితర గ్రామాలలో డీఓపీ పనులు, పంట కాలువలు, చెక్ డ్యామ్‌లలో పూడిక తీత పనులు జరుగుతున్నాయి. మండల పరిధిలో సుమారు 3500 మందికి జాబ్ కార్డులు ఉండగా, ఇందులో 2000 మంది దాకా ఉపాధి కూలీలు పనులకు పోతున్నారు. ఉపాధి హామీ పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఎర్రగుంట్ల మండల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఏపీఓ గంగాభవాని తెలిపారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ గంగాభవాని

పాత కలెక్టరేట్‌కు పూర్వ వైభవం తేవాలి

కడప కార్పొరేషన్: పాత కలెక్టర్ కార్యాలయానికి పూర్వ వైభవం తేవాలని నగరపాలక సంస్థ కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ అన్నారు. శుక్రవారం స్థానిక పాత కలెక్టరేట్‌ను ఆయన పరిశీలించారు. పాత కలెక్టరేట్‌లోని ప్రతి గదిని పరిశీలించి పూర్వం వినియోగించిన లైమ్ ప్లాస్టింగ్‌తోనే గోడలు సీలింగ్ మరమ్మతులు చేయాలని సూచించారు. టోపోగ్రఫీ సర్వే చేయించి మ్యాప్ సమర్పించాలని పంచాయితీ రాజ్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పాత కలెక్టరేట్‌లోని సామాగ్రికి సంబంధించి ఒక రిజిస్టర్ నిర్వహించాలని, సామాగ్రినంతా వేరొక చోటికి మార్చాలన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన..

మార్నింగ్ విజిట్‌లో భాగంగా కమిషనర్ టీజీపీ పార్కు, భగత్‌సింగ్ నగర్ పార్కు, యర్రముక్కపల్లె జంక్షన్, గాంధీ ప్లాజా, దేవునికడప ప్రాంతాలను పరిశీలించారు. టీజీపీ పార్కులో ఎంట్రెన్స్ గేట్, ఆర్చి పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పార్కులోని చెట్లను తొలగించకుండా పాత్ వే తయారు చేయాలన్నారు. భగత్ సింగ్ నగర్ యు పి హెచ్ సి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని 15 రోజులలో స్లాబ్ వర్క్ పూర్తి చేయా లని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఎర్రముక్కపల్లె జంక్షన్‌ను డిజైన్ ప్రకారం పూర్తి చేయాలన్నారు. 15 రోజుల లో గాంధీ ప్లాజా సిద్ధం చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. టి ఎల్ ఎఫ్ బిల్డింగ్ నిర్మాణ పనులను పరిశీలించిన కమిషనర్ ఆఫీసు రూమ్, మీటింగ్ హాల్ గోడలకి గ్లాస్ ఏర్పాటు చేయాలని సూచించారు. మీటింగ్ హాల్ లో ప్రొజెక్టర్, మైక్ స్పీకర్స్ ఏర్పాటుకు సంబంధించి ఎలక్ట్రికల్ కనెక్షన్ ఫ్లోరింగ్ నుండి తీసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు.

భక్తిశ్రద్ధలతో అన్నమయ్య జయంతి

కడప కల్చరల్ : పద కవితా పితామహుడు తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి వేడుకలను కడప నగరంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక మున్సిపల్ మెయిన్ హైస్కూల్ ఎదురుగా పునర్నిర్మాణ సంఘం ఆధ్వర్యంలో ఇటీవల నూతనంగా ప్రతిష్ఠించిన అన్నమాచార్య విగ్రహం వద్ద ఈ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కూడలిని పూలు, అరటి పిలకలతో నయన మనోహరంగా అలంకరించారు. అన్నమయ్య విగ్ర హానికి నిలువెత్తు పూలమాలను అలంకరించి పూజ లు నిర్వహించారు. పాత విగ్రహం స్థానంలో కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయడం, ఆ సర్కిల్‌ను అందంగా తీర్చిదిద్దినందుకు పునర్నిర్మాణ సంఘం సభ్యు లు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

‘తాళపత్రాల డిజిటలైజేషన్’ బ్రౌన్‌కు అప్పగింత

కడప కల్చరల్ : కడప నగరంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయం డిజిటలైజేషన్ చేసిన తాళపత్ర గ్రంథాలను తిరిగి అందజేసింది. తాళపత్రాల పరిరక్షణ విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వాటిని డిజిటలైజేషన్ చేసి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి శుక్రవారం అప్పగించింది. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషాపరిశోధన కేంద్రం శ్రీవేంకటేశ్వర వేదవిశ్వవిద్యాలయంతో గత సంవత్సరం అక్టోబరు 10వ తేదిన ఈ అంశంపై ఎంఓయూ చేసుకున్నది. అందులో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వైవీయూ ఉపకులపతి ఆచార్య చింతా సుధాకర్, కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య సూచనలు చేశారు. ఈ మేరకు బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్ రెడ్డి గ్రంథాలయంలోని తాళపత్రాల డిజిటలైజేషన్ కోసం 288 తాళపత్రగ్రంథాలను టీటీడీ వేద విశ్వవిద్యాలయానికి అందచేశారు. డిజిటలైజేషన్ అనంతరం వాటికి సంబంధించిన పెన్‌డ్రైవ్‌ను టీటీడీ వేదిక్ యూనివర్శిటీ వీసీ ఆచార్య రాణి సదాశివ మూర్తి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డికి తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఓయూ ప్రకారం గ్రంథాలను ఉచితంగా క్లీనింగ్, ఆయిలింగ్, ఇంకింగ్ చేశారని, అన్ని వివరాలతో డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. దీంతో తాళపత్ర గ్రంథాల మన్నిక ఎన్నో రెట్లు పెరుగుతుందని తెలిపారు.